క్లుప్తంగా

పరామర్శ



వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పట్టణంలోని కంచు పిల్ల వెంకటేశ్వరరావును మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు గిరి రఘు, అచ్చిబాబు, మేడిశెట్టి అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

సాలూరు: మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సేవలకు శనివారం అంతరాయం కలిగింది. శుక్రవారం కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో జనన, మరణ ధ్రువపత్రాలు తదితర పలు సేవలకు అంతరాయం కలిగింది. పాత వైరింగ్ వలన ఈ షార్ట్ సర్క్యూట్ జరిగిందని, పెద్దప్రమాదమేమి జరగలేదని మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ప్రసాద్ తెలిపారు.

చెత్త సేకరణపై అవగాహన



ఇంటింటా చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ అధికారులు

మక్కువ: మండలంలోని అన్ని పంచాయతీలలో పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి సూచనల ప్రకారం ఎంపీడీఓ స్వరూపరాణి, ఈఓపీఆర్డీ దేవకుమార్ పర్యవేక్షణలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమంపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు ఆయా పంచాయతీలలో ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించారు.

పిల్లలను పనిలో పెట్టడం నేరం



పట్టణంలో అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖాధికారులు

పార్వతీపురం టౌన్: పిల్లలను పనిలో పెట్టడం చట్టరీత్యా నేరమని జిల్లా సహాయ కార్మిక అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. కార్మిక చట్టాల అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం వివిధ దుకాణాల వద్ద పోస్టర్లను పంపిణీ చేసి అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాల్లోపు బాల బాలికలను పనిలో పెట్టుకోవడం పూర్తిగా నిషేధించినట్టు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణకు, వారి భవిష్యత్‌ను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చట్టాలను తెచ్చిందన్నారు. వీటిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముస్తాబవుతున్న శివాలయాలు



ముస్తాబైన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

పార్వతీపురం రూరల్: మహా శివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. మండలంలోని అడ్డాపుశీలలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో నిత్య పూజలు, రుద్రాభిషేకం, అభిషేకాలు నిర్వహించేందుకు అనువుగా బారికేడ్లను ఏర్పాటు చేశారు.

ఉచిత మొబైల్ సర్వీసింగ్ శిక్షణ



ఉచిత మొబైల్ శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులు

పార్వతీపురం టౌన్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో స్కిల్ డవలప్‌మెంట్, డాన్ బోస్కో సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మొబైల్ సర్వీసింగ్ శిక్షణ నిర్వహించినట్లు డైరెక్టర్ శ్రీవారాజు తెలిపారు. డాన్ బోస్కో సంస్థ ద్వారా ఆసక్తి గల యువతకు విద్య కోర్సులపై శిక్షణ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు!

- నూతన రేషన్‌కార్డుల కోసం అవస్థలు
- ఇప్పటి వరకు తెరుచుకోని ఆన్‌లైన్
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



రేషన్ కార్డులు

బలిజిపేట:

'అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తాం...' ఇది గత శాసనసభ సాధారణ ఎన్నికల సమయంలో కూటమి నేతలు ప్రతి చోట చెప్పిన మాట. హామీ ఇచ్చారు... ప్రజలు నమ్మి ఓట్లేశారు... అధికారం చేపట్టి ఎనిమిది నెలలు పూర్తయింది...కానీ ఇచ్చిన మాట మాత్రం నెరవేరడం లేదు. రేషన్‌కార్డులకు సంబంధించి ఇప్పటి వరకు ఆన్‌లైన్ తెరుచుకోలేదు. దీంతో కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారికి ఇది కలగానే మిగిలిపోయేలా ఉంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వృద్ధులు, భర్త చనిపోయిన వితంతువులు, నడవలేని దివ్యాంగులు ఇలా సామాజిక పింఛన్లు పొందాలంటే రేషన్‌కార్డు అవసరం ఉంది. ఈ క్రమంలో రేషన్‌కార్డుల కోసం అర్హులు నెలలుగా ఎదురు చూస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త రేషన్ కార్డులు ఎప్పుడు వస్తాయా? అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

గతంలో తలుపు తట్టి..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతర ప్రక్రియగా కొనసాగేది. ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించేవారు. అర్హతను బట్టి వెంటనే రేషన్‌కార్డులు మంజూరయ్యేవి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే కోవిడ్ విజృంభించింది. అయినా ప్రజలకు ఇచ్చిన మాట కోసం నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలకు మించి పథకాలు అమలు చేశారు. అందులో రేషన్‌కార్డు ఒకటి. కరోనా సమయంలో కొందరు పేదలు ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్నారని గుర్తించి రేషన్‌కార్డు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. స్పందన వేదికగా చేసుకుని ఇంట్లో నుంచి అర్జీ పెట్టుకున్నా రేషన్‌కార్డును మంజూరు చేయించారు. కరోనా తగ్గుముఖం పట్టిన తరువాత రేషన్‌కార్డుల మంజూరు వేగవంతం చేయించారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న అర్హులకు నిమిషాల వ్యవధిలో కార్డులను అందజేశారు. అది కూడా వలంటీర్ల ద్వారా అందజేస్తే గడప దాటకుండా కార్డును చేతిలో పెట్టేవారు. తరువాత ఆరు నెలలకు ఒకసారి గడువు పెట్టి కార్డును మంజూరు చేస్తూ వచ్చారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి దరఖాస్తుదారులకు భరోసా ఇచ్చారు.

రేషన్‌కార్డు ఎప్పుడిస్తారో..

"రేషన్‌కార్డు ఎప్పుడిస్తారా.. అని ఎదురు చూస్తున్నాం. పిల్లలతో ఉన్న మాకు కొత్త కార్డు వస్తే ఏమైనా పథకాలు ఇస్తే అవి వర్తిస్తాయని చూస్తున్నాం. గత నెలలో కార్డుకు దరఖాస్తు చేసుకోమన్నారు.. కానీ ఆన్‌లైన్ కాలేదు.

– సత్యవతి, పలగర, బలిజిపేట మండలం

ఇప్పుడు స్పష్టత ఏదీ?

అయితే నేడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా నూతన రేషన్‌కార్డుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. రేషన్‌కార్డు కోసం ఎదురు చూస్తున్న వారు అత్యధికంగా కొత్తగా పెళ్లయిన వారు, కుటుంబ తగాదాలతో విడిపోయినవారు, సభ్యుల చేర్పు, తొలగింపు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కుటుంబాలు, ఆదాయ పన్ను సమస్యలున్న వారు రేషన్‌కార్డు మంజూరు కోసం ఎదురుచూస్తున్నారు. కేవలం ప్రజాప్రతినిధులు మాటలు మాత్రమే చెప్పి జనవరిలో ఇస్తారని చెప్పారు కాని రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకునేందుకు ఇంకా సైట్ ఓపెన్ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. రేషన్‌కార్డుకు సంబంధించి ఎటువంటి మార్పు చేర్పులు చేసుకునేందుకు వీల్లేకుండా పోయిందని లబ్ధిదారులు చెబుతున్నారు.

● సాగునీటి కోసం ఆందోళన



పార్వతీపురం మన్యం జిల్లాకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు నిధులు కేటాయించి పెదంకలాం కాలువ శివారు భూములకు సాగునీరు అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసిస్తూ బలిజిపేటలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ పెదంకలాం కాలువకు 9వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. శివారు భూములకు సాగునీరు అందే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. అంపావల్లి ఎత్తిపోతల పథకం, తోటపల్లి పిల్ల కాలువల ద్వారా బర్లి, సుభద్ర, శివరాంపురం, అరసాడ, మిర్తివలస, చెల్లింపేట గ్రామాలకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ పార్టీ నాయకులు త్రినాధ, వెంకటరమణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

– బలిజిపేట

విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి



ఆర్టీసీ డిపో అధికారి సింహాచలంకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పార్వతీపురం టౌన్: టెన్త్, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హరికృష్ణ కోరారు. ఆర్టీసీ డిపో అధికారి సింహాచలంకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలలో టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. హాల్‌టికెట్ ఉన్న విద్యార్థులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. స్టూడెంట్ బస్సులతో పాటు ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమయపాలనతో బస్సులు తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉన్నారు.

ప్రమాదాల నియంత్రణకు సహకరించాలి

పార్వతీపురం రూరల్: వాహన చోదకులు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గాప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయ సమీపంలో వాహనాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు, లారీలు మితిమీరిన వేగంతో పాటు పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు చేయడం కారణంగా ప్రమాదాలు తరచు జరుగుతున్నాయన్నారు. అంతర్‌రాష్ట్ర రహదారిపై మితిమీరిన లోడ్లతో భారీ వాహనాలు అతివేగంగా వెళ్లడం కారణంగా ప్రమాదాలు జరిగి ఎంతో మంది మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయన్నారు.

2024 అక్టోబర్ నుంచి ఇంతవరకు పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు చేసిన 355 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.2.80 లక్షల అపరాధ రుసుం విధించామన్నారు. రహదారి భద్రత నియమాలు ఉల్లంఘించిన వాహన చోదకులకు సంబంధించి 97మంది డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేసినట్టు తెలిపారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సీతానగరం: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. రామవరం, పాపమ్మవలస, ఇప్పలవలస గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో జరుగుతున్న సీసీ కాలువలు, సీసీ రోడ్లు, గోశాలల నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.లక్షల వ్యయంతో ప్రజావసరాలకు అనుగుణంగా కాలువలు, రోడ్లు మంజూరు చేయాలని వచ్చిన వినతుల మేరకు అభివృద్ధి పనులు మంజూరు చేసినట్టు చెప్పారు. ప్రారంభించిన పనులు ఇంజినీరింగ్ సహాయకుల ఆధ్వర్యంలో నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఇబ్రహిం

- ఎంపీపీ మర్రి పారమ్మ

మక్కువ: రానున్న వేసవి దృష్ట్యా మండలంలో అన్ని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పారమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అభివృద్ధి పనులపై ఎటువంటి తీర్మానాలు చేయడం లేదన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని ప్రజాప్రతినిధులకు వివరించారు. అభివృద్ధి పనుల విషయంలో అంతా పరస్పర సహకారంతో పని చేద్దామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చప్ప అన్నపూర్ణమ్మ, ఎంపీడీఓ డీడీ స్వరూపరాణి, తహసీల్దార్ షేక్ ఇబ్రహిం, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు సహకరించాలి



అడ్డాపుశీల గ్రామంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

పార్వతీపురం రూరల్: పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రమణమూర్తి కోరారు. మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో పారిశుధ్య నిర్వహణను ఆయన శనివారం పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణను స్వయంగా పరిశీలించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా చేసి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలించాలన్నారు. సేకరించిన చెత్తలో గాజు, ప్లాస్టిక్ పరికరాలను వేరు చేసి బయట సంపద సృష్టించే కేంద్రాలకు విక్రయించాలన్నారు. చెత్త సేకరణలో గ్రీన్ అంబాసిడర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మండలంలోని ప్రతీ గ్రామ పంచాయతీలో వెయ్యి మంది జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్, ఒక ట్రైసైకిల్‌ను సమకూర్చామన్నారు. పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..



గుడివాడ సూర్యనారాయణ

సాలూరు: సాలూరు అసెంబ్లీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్‌గా తనను నియమించిన వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని గుడివాడ సూర్యనారాయణ(పాస్టర్ సువార్తరావు) అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలిపారు.

జీఓ 3 పునరుద్ధరించాలి

సీతంపేట: జీఓ 3 పునరుద్ధరించాలని ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఈ నెల 24 నుంచి జరగనున్న శాసనసభా సమావేశాల్లో జీఓ 3పై ప్రస్తావించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే ఎన్. జయకృష్ణకు వినతి పత్రం అందజేశారు. గిరిజన అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర, చింతపండు, కొండచీపుర్లకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. అలాగే స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులు, కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు

పార్వతీపురం టౌన్: ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు పొరుగు సేవల సిబ్బందిని నియమించుకునే అధికారం వివిధ శాఖలకు ఇవ్వాలనే రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో శనివారం నిరసన చేపట్టి కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి వర్గం ఈ నెల 6వ తేదీన జరిగిన సమావేశంలో ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు పొరుగు సేవల కార్మికుల నియామకాలను వివిధ ప్రభుత్వ శాఖలకు అధికారం ఇవ్వాలని తీర్మానించినట్లు మీడియాలో, పత్రికల్లో వార్తలు వచ్చాయని తెలిపారు. ఆప్కాస్ ఉద్యోగులలో భయాందోళనలను రేకెత్తించిందన్నారు. ఆప్కాస్‌లో నమోదైన వారు సుమారు లక్ష మంది ఉంటే అందులో దాదాపు 45 వేల మంది మున్సిపల్ కార్మికులే వున్నారన్నారు. ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అధికారాలు అప్పగించాలనే మంత్రి వర్గ ప్రతిపాదనలు వెంటనే ఉపసంహరించుకోవాలని, అలాగే ఆప్కాస్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మామిడి శివ, పి.సంతోష్, బి.రాజేష్, జి.గంగరాజు, గంగేయ్యలు, బి.రవి, సుజాత, ఇప్పలమ్మ, పాపులమ్మ, శాంతి, చిరంజీవి, కార్మికులు పాల్గొన్నారు.

బోర్డు మారింది.. కానీ...



కాలనీ పాత బోర్డు ఇదే..



నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా పోలీసు కార్యాలయం బోర్డు

పార్వతీపురం రూరల్: మూడు దశాబ్దాల కిందట బలహీన వర్గాల వారికి పక్కా గృహాలను నిర్మించాలనే లక్ష్యంతో అప్పటి ఎమ్మెల్యే యర్రా కృష్ణమూర్తినాయుడు ఇళ్ల స్థలాలను మంజూరు చేసేలా కాలనీని ఏర్పాటు చేశారు. 1996 – 97 సమయంలో యర్రా కృష్ణమూర్తి శాటిలైట్ టౌన్‌షిప్ పేరుతో సుమారు వెయ్యి మందికి లబ్ధి చేకూరేలా ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. ఆయన గుర్తుగా కాలనీకి యర్రా కృష్ణమూర్తి కాలనీగా నామకరణం చేసి ముఖ ద్వారం కూడా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఆ బోర్డును యర్రా కృష్ణమూర్తి గుర్తుగా ఉండేది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి కూడా చిరునామా కోసం ల్యాండ్ మార్కుగా కొనసాగేది. అయితే పార్వతీపురం కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేయడంతో యర్రా కృష్ణమూర్తి కాలనీలో జిల్లా పోలీసు కార్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆ శాఖాధికారులు యర్రా కృష్ణమూర్తి కాలనీ పేరు ఉన్న బోర్డు స్థానంలో జిల్లా పోలీసు కార్యాలయం పేరిట కొత్త బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. జిల్లా పోలీసు కార్యాలయం బోర్డు ఏర్పాటు చేసినా.. దాంతో పాటు యర్రా కృష్ణమూర్తి శాటిలైట్ టౌన్ షిప్ బోర్డు కూడా ఉంటే ఈ ప్రాంతానికి గుర్తింపు ఉండేదని ఈ ప్రాంతీయులు చర్చించుకుంటున్నారు.

జ్ఞానజ్యోతిపై శిక్షణ



శిక్షణను పరిశీలిస్తున్న సీడీపీఓ, ఎంఈఓలు

మక్కువ: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్స్ రాజశ్రీ లీలావతి, ఉమామహేశ్వరరావు, వెంకటమణ, జగన్మోహన్‌రావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని స్కూల్ ఎడ్యుకేషన్, ఉమెన్ డెవలప్‌మెంట్ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్న పిల్లల మానసిక, శారీరక అభివృద్ధి మెరుగుపరిచేందుకు, అంగన్‌వాడీలను బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రథమ్ సంస్థ సహకారంతో ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. శిక్షణను సీడీపీఓ బి.అనంతలక్ష్మి, ఎంఈఓలు సత్యనారాయణ, శ్యాంసుందర్ పరిశీలించారు.

సారా పట్టివేత

పాలకొండ రూరల్: మండలంలోని శివారు గ్రామాల్లో పాలకొండ ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు చేపట్టగా 35 లీటర్ల సారాతో ఇద్దరు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై సీహెచ్ రాజేశ్వరి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సహాయ కమిషనర్ పి.రామచంద్రరావు నేతృత్వంలో సరిహద్దు గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు తనిఖీలు చేపట్టామన్నారు. అనుమానాస్పదంగా ఉన్న బి.అప్పయమ్మ, ఆర్.పార్వతిలను అదుపులోకి తీసుకోగా.. సారా పట్టుబడిందన్నారు. ఈమె వెంట హెచ్‌సీలు జి.సుదర్శన్‌కుమార్, కె.రాంబాబు, బి.రాము, తదితరులున్నారు.

సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- డీపీఓ కొండలరావు

గరుగుబిల్లి: గ్రామాలను సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి టి. కొండలరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో పారిశుధ్య నిర్వహణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేకరించిన చెత్తలో ప్లాస్టిక్, గాజు పరికరాలను వేరుచేయాలన్నారు. చెత్తసేకరణలో గ్రీన్ అంబాసిడర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలోని 451 గ్రామ పంచాయతీల్లో ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్, ఒక ట్రై సైకిల్‌ను సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై దృష్టి సారించండి..



తవ్వకాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని అల్లువాడ, తుంబలి గ్రామాల మధ్య ప్రధాన రహదారికి ఆనుకుని జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలపై అధికారులు దృష్టి సారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. పది రోజులుగా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని సీపీఎం నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ.. ఇప్పటికే రెవెన్యూ అధికారుల చొరవతో రెండు లారీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికీ అక్రమ తవ్వకాలు మాత్రం యథావిధిగా కొనసాగుతున్నాయని మండిపడ్డారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కె. సీతారాం పాల్గొన్నారు.